క్లుప్తంగా

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయంలో శనివారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 14వ తేదీ నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజుకో అలంకారంతో భక్తులను కనువిందు చేయనున్నారన్నారు. ఉత్సవాలలో భాగంగా 14న చదనాలంకారం, 15న బాల త్రిపురసుందరిదేవిగా, 16న గాయత్రీ దేవిగా, 17న లలితా త్రిపురసుందరిగా, 18 అన్నపూర్ణదేవిగా, 19న మహాదేవిగా, 20న సరస్వతిదేవిగా, 21న దుర్గాదేవిగా, 22 మహిషాసురమర్ధినిగా, 23న రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారని తెలిపారు.

మంత్రికి జ్ఞాపిక బహూకరణ



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: చిదంబరం నుంచి తెప్పించిన అన్టిక్ (పురాతన) వేంకటేశ్వర స్వామి ప్రతిమను చిత్తూరు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బహుకరించారు.చిత్తూరులో శుక్రవారం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వచ్చిన ఆయన్ను కలిసి వాటిని అందజేశారు.

క్రీడా విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి కబాడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి పోటీల్లో గెలుపొందారు. దాంతో వారిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు నాగయ్య పాల్గొన్నారు.

21న ప్రత్యేక రెవెన్యూ లోక్ అదాలత్

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో ఈనెల 21వ తేదీన రెవెన్యూ కేసుల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను తహసీల్దార్లు, న్యాయవాదులు విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో తహసీల్దార్లు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సబ్ కోర్టు పరిధిలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, పుత్తూరు, నగరి తహసీల్దార్లు పరమేశ్వరస్వామి, అమరేంద్రబాబు, ఏజీపీ ఉదయ్‌కుమార్, న్యాయవాది సంజీవి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వరి సాగు



నాట్లకు నారును సిద్ధం చేస్తున్న రైతులు



డ్రమ్ సీడర్‌ను సిద్ధం చేస్తున్న రైతులు

- అనుకూలిస్తున్న వర్షాలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- అవసరాలకు తగ్గట్లు ఎరువుల సరఫరా

చిత్తూరు రూరల్: రబీ సీజన్ ఈ నెల నుంచి ఆరంభమైంది. ఇటీవల కురిసిన వర్షాలు సీజన్‌కు అనుకూలిస్తున్నాయి. దీంతో మండలంలోని రైతులు రబీలో విస్తారంగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. జోరుగా వరినాట్లు వేస్తున్నారు. దీంతోపాటు వివిధ రకాల కూరగాయల పంటలు చకాచకా నాటుకుంటున్నారు. సీజన్ దృష్ట్యా వ్యవసాయశాఖ అధికారులు ఆర్బీకేలకు ఎరువులు సరఫరా చేస్తున్నారు. రైతులకు కావాల్సినంత మేర అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

అనుకూలించిన వర్షం

ఖరీఫ్ ప్రారంభంలో వరుణుడు దూరమయ్యాడు. ఆ తర్వాత కురిసిన వర్షాలు మాత్రం రబీకి అనుకూలంగా మారాయి. కుంటలు, బావులు, చెరువులు, కాలువలు నిండుతున్నాయి. బోరుబావుల్లో నీటి మట్టం పెరిగింది. దీంతో రైతులకు నీటి కష్టాలు తప్పుతున్నాయి. రబీసాగుకు ఊతమిస్తున్నాయి. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 170 మి.మీ. కాగా 190.04మి.మీ.గా నమోదైంది. ఈనెల 170.6 మి.మీ. సాధారణ వర్షంపాతం ఉంటే, ఇప్పటికి 51.4 మి.మీ. నమోదైంది. ఈ వర్షాలు ప్రధానంగా వరిసాగు చేసే రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

సాగు ఇలా...

రబీ సీజన్‌లో వరి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. వరి సాధారణ విస్తీర్ణం 299 హెక్టార్లు కాగా, ఇప్పటికన 2 హెక్టార్లలో సాగులోకి వచ్చింది. మిరపనాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్లో మిరప ధర అమాంతంగా పెరగడంతో డిమాండ్‌కు తగ్గట్టు సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిరప సాధారణ విస్తీర్ణం 77 హెక్టార్లు కాగా ఈసారి 80 హెక్టార్ల వరకు సాగవుతుందని భావిస్తున్నారు. దీంతోపాటు వివిధ రకాల కూరగాయల పంటలు 972 హెక్టార్లు, వేరుశనగ 62 హెక్టార్ల వరకు పంటలు సాగవుతాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు తగ్గట్టు వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా సకాలంలో ఎరువులు తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎరువుల నిల్వలు

చిత్తూరు మండలం పరిధిలో 9 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఈ పరిధిలో 8వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో వరిసాగు చేసే రైతులు 2 నుంచి 3వేల మంది ఉంటారు. వీరికి సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం ఆర్బీకేల్లో యూరియా 15 మెట్రిక్ టన్నులు, డీఏపీ 6.25 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 03 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఇవి పోను 150 మెట్రిక్ టన్నులు కావాలని మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. త్వరలో ఆ ఎరువులు ఆర్బీకేలకు చేరేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఎరువుల్లో కూడా నాణ్యత ఉండేలా చూస్తున్నారు.

వరివిత్తనాలు

రబీ అంటే మండలంలో వరికి ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రమంలో మేలైన రకాన్ని పండించేలా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు. పొలంబడితో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. నాట్ల నుంచి పంట ఎదుగుదల వరకు నియమావళిని వివరిస్తున్నారు. వరి విత్తనంలో ఏడీటీ -37, ఏడీటీ -39, ఆర్ఎన్ఆర్ 15048, ఎంటీయూ 1010, ఎంటీయూ 1001 వంటి రకం ఎంచుకోవాలని చెబుతున్నారు. ఇక చాలా మంది రైతులు నారు పోసి నాట్లు వేస్తున్నారు. డ్రమ్ సీడర్ ద్వారా వేసుకుంటే కూలీల భారం తగ్గడం, పంట ఎదుగుదల, దిగుబడి ఆశాజనకంగా వస్తుందని సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఉత్తమం. వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు తీసుకుని పంటలు వేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకోవాలి. వాటి ఆధారంగా పంటలు సాగు చేస్తే నష్టాలు ఉండవు. లాభాలు గడించవచ్చు. ప్రధానంగా వరి నాట్లు వేయడంలో డ్రమ్ సీడర్ పద్ధతి పాటించడం మేలు. పంట ఎదుగుదలలో ఇష్టానుసారంగా పురుగుల మందు వాడకం మంచిది కాదు. ఆర్‌బీకేలో కావాల్సినంత ఎరువులు అందుబాటులో ఉంటాయి.

–మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ

సమష్టి కృషితోనే చిత్తూరు అభివృద్ధి

- కౌన్సిల్ సమావేశంలో మేయర్ అముద
- ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేద్దాం
- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడానికి సభ్యులంతా కలిసికట్టుగా కృషి చేద్దామని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నగర మేయర్ ఎస్ అముద అధ్యక్షతన నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ జె అరుణ, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో అజెండా అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు.

- 15వ ఆర్థిక సంఘం 2022–23 ప్రతిపాదనలు మంజూరు చేసిన మొత్తం రూ.4.51కోట్ల వార్షిక అభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వ ఆమోదం కోసం పంపడానికి కౌన్సిల్ ఆమోదించింది. నగరపాలక సంస్థలో టీపీఓగా పనిచేస్తున్న డి.మురళీకృష్ణను ఆయన మాతృశాఖకు సరెండర్ చేసేందుకు ఆమోదించారు.
- కొంగారెడ్డిపల్లిలోని రీడ్స్ పేట్ ఏరియాలోని 12,164 చదరపు అడుగుల మునిసిపల్ స్థలంలో 2,400 చదరపు అడుగుల స్థలాన్ని నగరపాలక ఆర్థిక పురోగతి దృష్ట్యా లీజ్ పద్ధతిన కేటాయించేందుకు, మిగిలిన స్థలాన్ని భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించడానికి కౌన్సిల్ ఆమోదించింది.
- కార్పొరేషన్ న్యాయ సలహాదారులుగా వి.లోకనాథరెడ్డి నియమించేందుకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా కార్పొరేషన్‌కు కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన నిధులు వ్యయం చేయడానికి కౌన్సిల్ ఆమోదించింది.
- పరిపాలన, అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాల అధ్యయనం కోసం కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రధాన అధికారుల కేరళ పర్యటనకు కౌన్సిల్ ఆమోదించింది.
- కార్పొరేషన్‌లో పలు కేటగిరిలో 28 పోస్టులు మంజూరు చేయడానికి రాష్ట్ర మునిసిపల్ డైరక్టర్‌కు ప్రతిపాదనలు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో, గంగినేని చెరువు కట్ట మీద ఉన్న రోడ్డుపై ప్రజలు వాకింగ్ చేయడానికి వీలుగా సాయంత్రం 5 నుంచి ఉదయం 7 గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధిస్తూ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది.
- కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కమిషనర్ అరుణతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు వేగంతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న శ్మశాన వాటిక పనులు త్వరగా పూర్తి చేయిస్తామని, డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టిడ్కో గృహాల్లో పెండింగ్ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని వివరించారు. నగరంలో కొన్నిచోట్ల దారులు ఆక్రమణలకు గురయ్యాయని, వీటిపై కోర్టులో నడుస్తున్న కేసులను పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి రెండు విడతల్లో ఒక్కో డివిజన్‌కు రూ.50 లక్షల నిధులు అందుబాటులోకి వచ్చాయని, ప్రజోపయోగ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు. గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన చవటపల్లె రోడ్డు, మైదా ఫ్యాక్టరీ రోడ్డు, కొంగారెడ్డిపల్లె మేజర్ డ్రైన్ పనులను త్వరగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

పెండింగ్ కేసులపై ఆరా



గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

గుడిపాల: పెండింగ్ కేసులపై చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. బంగారం చోరీ కేసులో నిందితులను వెంటనే పట్టుకోవాలని అందుకోసం ఒక బృందాన్ని తయారుచేసుకోవాలని సీఐ రవిశంకర్‌రెడ్డికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. ఏఎస్‌ఐలు చలపతి, మునివేలుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజి కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బకాయిల సమస్యపై విజయవాడలో ఈ నెల 13న ఆర్థిక కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. బదిలీలు పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ పలువురు ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు రాలేదన్నారు. ఎయిడెడ్ టీచర్లకు జీతాలు మంజూరు కాలేదని తెలిపారు. పీఆర్‌సీ, డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరామన్నారు. ఆర్థిక కార్యదర్శి సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు.

స్కూల్ తనిఖీ



వంట గదిలో గ్లాసును పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

బంగారుపాళెం: విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ శుక్రవారం రాత్రి మండలంలోని గుండ్లకట్టమంచి జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వంట గది, విద్యార్థులు రాగి జావ తాగేందుకు ఉపయోగించే గ్లాసులు, పాఠశాలకు ప్రభుత్వం అందజేసి టీవీ పనితీరు, నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం గంగవరం మండలానికి బయలుదేరి వెళ్లారు. వీరి వెంట డీఈఓ విజయేంద్రరావు, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

దసరా ఉత్సవాలు విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

చిత్తూరు రూరల్: అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం నుంచి జరిగే దసరా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ కేఎం కుమార్, అర్చకులు కుమార్ కోరారు. చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వారు సమావేశంలో మాట్లాడారు. దసరా ఉత్సవాలు శనివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఉదయం అభిషేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నట్లు వివరించారు. మహా అమావాస్యను పురస్కరించుకుని శనివారం సాయంత్రం అమ్మవారిని నగర వీధుల్లో ఊరేగిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

సప్తకనికలమ్మ సన్నిధిలో మంత్రి



చిత్తూరు రూరల్: నగరంలోని దొడ్డిపల్లిలో వెలసిన శ్రీ సప్తకనికలమ్మ ఆలయాన్ని శుక్రవారం రాష్ట్ర విద్యుత్, అటవీశాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. కనికలమ్మ జ్యోతి అందించి, దర్శనభాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, నాయకులు భూపేష్ గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

చిత్తూరు రూరల్: మాస శివరాత్రిని పురస్కరించుకుని చిత్తూరు గిరింపేటలోని శ్రీ సత్యసాయి సేవా సమితిలో శుక్రవారం రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హారతి, విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మధుసూదనం, శేషనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో భక్తి శ్రద్ధలతో దసరా వేడుకలు



లిటిల్ రోస్ పాఠశాలలో..



విజయం పాఠశాలలో..

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా దసరా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుందరరాజపురంలో ఉన్న విజయం పాఠశాలలో వేడుకలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజ తెలిపారు. గాంధీరోడ్డు వద్ద ఉన్న లిటిల్ రోస్ పాఠశాలలో దసరా వేడుకలు నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ గోపాల కృష్ణమూర్తి వెల్లడించారు. భారతదేశం వివిధ సంప్రదాయాలకు పుట్టినిల్లు అని విద్యార్థులకు వివరించారు. ఆ పాఠశాల విద్యార్థులు రావణాసురుడు, అమ్మవారి వేషధారణలో విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల అకడమిక్ ఇన్‌చార్జి, డైరెక్టర్ లోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం మన రాష్ట్రం నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడంతో క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపల వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు స్వామిదర్శనం కల్పించారు. క్యూలో నిరీక్షిస్తున్న భక్తులకు మంచి నీరు అందించారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా

గుడిపాల: ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు భరోసా ఇస్తున్నాయని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీలాపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు దాదాపు 276మందికి పైగా వైద్యం చేసి, మందులు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు కంటి అద్దాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు దుర్గాప్రసాద్, సాయిక్రిష్ణ, అనూష, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మొగిలిమిట్టూరులో సురక్ష వైద్య శిబిరం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామ సచివాలయం పరిధిలోని మొగిలిమిట్టూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 415 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహరి, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

యాదమరి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని కీనాటపంల్లె సర్పంచ్ మన్వేల్ అన్నారు. మండలంలోని కీనాటంపల్లె సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్, వైద్యులు, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





గుడిపాల: కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, బంగారుపాళెం: కళ్లద్దాలను అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

కాణిపాకంలో..

ఐరాల: రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం జగనన్న లక్ష్యమని ముదిగోళం సర్పంచ్ మునిరత్నం, మండల సచివాలయ కన్వీనర్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని పుల్లూరు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు 428 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్నవారికి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, యశ్వంత్, శరవణశ్రీనివాస్, ఎంపీడీఓ నాగరాజు, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విశేష స్పందన

పూతలపట్టు: మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని పోలవరం పంచాయతీ పరిధిలో శుక్రవారం సర్పంచ్ నిర్మలమ్మ, ఎంపీటీసీ కృష్ణమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు ఉచిత మందులు, ఆయుష్మాన్ కార్డులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు.



యాదమరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివరాజ్



ఐరాల: శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు



పూతలపట్టు: సురక్ష కిట్లు ప్రదర్శిస్తున్న నేతలు